# న్యాయమైన తీర్పు

శ్రీ పి. ప్రభుదాస్

మన దేశముపై దండెత్తివచ్చిన సార్వభౌములలో సికందరు మిక్కిలి ప్రజ్ఞాశాలి, వీరుడు. అనేక దేశములు జయించినాడు. ఒకసారి మన దేశముపై దండెత్తివచ్చి పంజాబులో కొంత భాగము ఆక్రమించినాడు.

ఒకరోజు తిరుగుతూవస్తూ పంజాబులో ఒక గ్రామానికి వచ్చాడు. అక్కడ ఒక రైతు గుడిసె ఉంది. ఆ రైతు ఆగ్రామానికి అధిపతి. గ్రామాధికారి సికందరును చాలా గౌరవించి ఉన్నతాసన మిచ్చాడు. తదుపరి ఒక వెండిపళ్ళెంలో కొన్ని తిను బండారాలు, మరొకప్రక్క కొన్ని బంగారు కణికలు వుంచుకొని చక్రవర్తికి సమర్పించాడు. తిను బండారాలతో బంగారు ముక్కలను చూచి నవ్వుకొన్నాడు. తేడు రైతును పిలచి అడిగాడు "మీరు భోజనానంతరం కొంత బంగారాన్ని కూడా స్వీకరిస్తూ ఉంటారా ?"

ఆ మాటకు రైతు జవాబిచ్చాడు "లేదు మహారాజా ఇక్కడివాళ్లు అట్లా చేయరు. కానీ మీరు యీ వెండి బంగారాలకోసమే మీ ఇల్లూ వాకిళ్ళూ వదలి ఇంతదూరం వచ్చారని విన్నాను. అందుకనే యీ కానుకలు తమకు సమర్పించుకుంటున్నాను. తమరు దయయుంచి వీటిని స్వీకరించండి."

సికందరు జవాబిచ్చాడు. "లేదు, లేదు. ధనధాన్యాదుల లాలసతో నేను హిందూదేశంరాలేదు మీ దేశవాసుల కట్టుబాట్లు, అలవాట్లు, నీతి, నిజాయితీల చూడ్డానికి వచ్చా"నన్నాడు.

ఇంతలో ఇద్దరు గ్రామస్థులు తమలో తాము కలహించుకుంటూ తీర్పుకోసం గ్రామాధికారి కడకు వచ్చారు.

అందులో ఒకడన్నాడు "అయ్యా, నేను ఇతనియొద్ద ఒక పొలమును కొని ఉన్నాను. ఆ పొలంలో నాకు వెండి బంగారాలతో నిండిన బిందె దొరికింది, అది నాకు సంబంధించినదికాదు. ఎందుకంటే నేను కొనేటప్పుడు పొలాన్ని మాత్రమే కొనుక్కున్నాను. పొలంలో దొరకబోయే వస్తువుని కొనలేదు. అందుకని నేను అతని బిందె అతనికిచ్చివేస్తానంటే అతను పుచ్చుకోడంలేదు. దయయుంచి మీరు అతన్ని వప్పించాలని ప్రార్థిస్తున్నాను."

ఇది విని గ్రామాధికారి రెండవ అతన్ని అడిగాడు.

"ఇక నీవేమి చెబుతావు ?"

రెండవవాడన్నాడు "అయ్యా, నేను అతనికి పొలమును అమ్మినప్పుడు పొలంలో గడ్డిమొలవనీ, నిధినిక్షేపాలు దొరకనీ అతనికే చెందుతాయి. అతని అదృష్టంకొద్దీ అతనికి ఆ భాగ్యం దొరికింది. నేను ఆ బిందెను ఏమాత్రమూ పుచ్చుకోను."

ఇద్దరి ఫిర్యాదువిని సికందరు ఆశ్చర్య చకితుడైనాడు. 'తీర్పు ఎట్లా చెబుతాడా' అని సికందరు గ్రామాధికారివంక కన్నెత్తకుండా చూస్తూ కూర్చున్నాడు.

కొంతసేపు ఆలోచించి గ్రామాధికారి మొదటివాన్ని పిలిచి అన్నాడు. "నీ ఇంట్లో వ్యక్తురాలై పెండ్లీడుకొచ్చిన ఒక అమ్మాయి ఉందికదూ ?"

"చిత్తం నా కూతురు ఉంది."

వెంటనే అధికారి రెండవవాణ్ని అడిగాడు "నీ ఇంట్లో ఒక యువకుడున్నాడు కదూ ?"

"చిత్తం"

"వయస్సు ?"

"పాతిక సంవత్సరాలు"

అధికారి మొదటి గ్రామస్థుని పిలచి అన్నాడు "మీ అమ్మాయిని అతని అబ్బాయికిచ్చి వివాహం చెయ్యి. ఆ బిందె కట్నంక్రింద వాళ్ళిద్దరకూ ఇచ్చివేయి. నీ అల్లుడూ నీ కూతురూ సుఖంగా ఉంటారు. మీ ఇద్దరి సమస్య తీరిపోతుంది. ఇద్దరూ బంధువులే అవుతారు. ఇక మీకు ఏ చిక్కూ లేదు."

ఈ తీర్పువిని గ్రామస్థులిద్దరూ ఎంతో సంతోషపడ్డారు. వందనాలర్పిస్తూ ఇండ్లకు చేరుకున్నారు.

ఈ పంచాయితీచూచి సికందరు ఆనంద పరవశుడైనాడు. గ్రామాధికారితో అన్నాడు "సోదరా! నేను ఇది చూడడానికే ఇంతదూరం వచ్చాను. హిందూ దేశ ప్రజలు - ఉదార స్వభావులని, నిజాయితీపరులని, లోభత్వానికి లోనుకారని వినియున్నాను. ఇప్పుడు నా కళ్ళఎదుటే ఆ సత్యాన్ని గ్రహించాను" అని చెప్పి సికందరు అక్కడనుండి వెళ్ళిపోయాడు.

